నవల



# నేను సైతం

సింహప్రసాద్



# నేను సైతం

## సింహప్రసాద్

**శ్రీశ్రీ ప్రచురణలు**

401, మయూరి ఎస్టేట్స్,

యం.ఐ.జి.II/650.

కె.పి.హెచ్.బి, హైదరాబాద్ – 85

సెల్. 98490 61668

# Nenu Saitham

By Simha Prasad
e-mail : simhaprasad@ yahoo.com

© **రచయిత**

ప్రథమ ముద్రణ :

**జూలై 2013**

ముఖచిత్రం : అక్బర్

వెల : ₹ **80/-**

డి.టి.పి :

ప్రింటర్స్ : **అనుస్వర క్రియేషన్స్**
సంజీవరెడ్డి నగర్, హైదరాబాద్.
ఫోన్ : 9000999183, 9848549158

ప్రతులకు :

**అన్ని ప్రధాన పుస్తక కేంద్రాలలో**

మరియు

**Sri Sri Prachuranalu**
401, Mayuri Estates,
Near Temple Bus stand,
KPHB, Hyderabad - 500 085.
Cell : 98490 61668

# నేను సైతం

"**మూ**డోసారీ ఆడపిల్లనే కన్నదిరా నీ పెళ్లాం! అది మన పాలిట పెద్దమ్మరా నాయనా. ఇల్లు గుల్ల చెయ్యడానికే మనింట మెట్టింది. ఎర్రగా బుర్రగా వుందని ఆశపడ్డాం గాని దానిది శనిపాదం అని కానుకో లేకపోయామొరే. ఇక నీ బతుకు ఆడపిల్లలకి అడ్డమైన చాకిరీ చెయ్యడంతోనే తెల్లారి పోతుందిరా అబ్బాయ్...!"

ఆసుపత్రిలో అంతా వింటున్నారైనా చూడకుండా గొంతెత్తి మరీ వాపోతున్న తల్లి వంక ఇబ్బందిగా చూశాడు సుబ్బారావు.

"వూరుకోమ్మా. అంతా మన వంకే చూస్తున్నారు...!"

"నోరు మూసుకుని ఏడవటం తప్ప ఇంకేం చెయ్యగలన్రా నాయనా. ఒకరా ఇద్దరా ముగ్గురు ఆడపిల్లల్ని కని నీ నెత్తిన పెట్టిందా మహాతల్లి. నీ మొహం చూస్తోంటే కడుపులోంచి దుఃఖం తన్ను కొస్తోందిరా నాయనా...!"

"సరిసరే గాని వూరుకోమ్మా. ఇప్పుడేం చెయ్యగలం చెప్పు. మన చేతుల్లో ఏమీ లేదు కదా!"

"అలాగే సరి పెట్టుకోవాలి మరి. కోడలితో బాటు పురుడు పోసుకున్న ఇద్దరూ పండంటి మగబిడ్డల్ని కనలేదూ! చేసుకున్న వారికి చేసుకున్నంత అన్నారు. తక్కువ నోములు నోసి ఎక్కువ ఆశిస్తే ఏం లాభంలే. అంతా నీ ప్రారబ్దంరా. లేకపోతే రాజాలాంటి నర్సాపురం సంబంధం వదులుకుని ఈ జ్యేష్ఠాదేవి నెందుకు కట్టుకుంటావూ...!"

"ఎప్పుడో జరిగిపోయింది ఇప్పుడు తవ్వుకోవడం ఎందుకమ్మా" కించిత్తు విసుగ్గా అన్నాడు.

"అంతకంటే ఇంకేం మిగిల్చిందిరా చెయ్యడానికీ! ఆడపిల్లల పెంపకమంటే మాటలు కాదొరేయ్. ఎంత ఆస్తి వున్నా రిబ్బన్లకీ లంగాలకే చాలదు. ఆపైన పెళ్లిళ్ళూ కట్నాలు పురుళ్ళూ పుణ్యాలూ తద్దులూ నా శ్రాద్ధం నా పిండా కూడు... ఎన్నుంటాయో!" కళ్ళొత్తుకుంది శేషమ్మ.

"డాక్టరమ్మ వస్తోంది. వూరుకో వూరుకో....."

సుబ్బారావు మాటలకు రెచ్చిపోయిందావిడ. "వూరుకోవడం కాదురా రేపు వాళ్ళని పెంచలేక నువ్వు ఉరేసుకోవాలి. అయ్యో అయ్యో! వరసగా ముగ్గురాడపిల్లల్ని కంటుందా నీ పెళ్లాం.....!"

ఆ మాటలు విన్న డాక్టరమ్మ ఆవిడ దగ్గరి కెళ్ళి అంది "ఇందులో మీ కోడలి తప్పే ముంది బామ్మగారూ. వేప విత్తనం నాటితే వేప మొక్కే మొలుస్తుంది గాని మామిడి మొక్క మొలవదు కదా!"

"అయన్నీ నాకేం తెలుస్తాయమ్మా చదువుకున్నానా పెట్టానా! నా ఏడుపంతా నా కొడుకు భవిష్యత్తు గురించే...!"

"దాని గురించేం వర్రీ కాకండి. కాలం ఎప్పుడూ ఇలాగే వుండి పోదు. ఆడపిల్లని కనటమే అదృష్టం అనే రోజులొస్తాయి. పైగా కొడుకు పెళ్ళయ్యేదాకానే కొడుకు. కూతురు మాత్రం జీవితాంతం కూతురే.....!"

"మాకు తెలీదులేమ్మా. నీకు పిల్లలెందరూ?" చేతులు తిప్పుతూ అడిగింది.

"ఒకబ్బాయి..."

"అదీ అలా చెప్పు. ఏరు దాటిందానివి. ఎన్ని కబుర్లైనా చెబుతావు. మోసేవాడికి తెలుస్తుంది కావిడ బరువు అని వూరికే అన్లేదు...!"

ఆవిడ వాక్ప్రవాహానికి భయపడి డాక్టరమ్మ చల్లగా జారుకుంది.

దాంతో పెట్రేగిపోయింది శేషమ్మ. రోగులూ నర్సులూ రోగుల్ని చూట్టానికొచ్చిన వారూ పోగయ్యారు. అవునవునంటూ చూశారు. తలలాడించారు. మరి ఆవిడ నోటికి అడ్డూ అదుపూ లేకపోయింది.

అక్కడుండలేక జనరల్ వార్డులో వున్న భార్య దగ్గరి కెళ్ళాడు.

ఆమె ఏడుస్తోంది. అక్కడి దాకా విన్పిస్తున్నాయి మరి తల్లి మాటలు!

"ఎందుకేడుస్తావూ వూరుకో.."

"మీ అమ్మ చూశారా ఎన్ని మాటలంటోందో ఎన్ని శాపనార్థాలు పెడుతోందో! నేను మాత్రం ఏం చెయ్యను చెప్పండి. కావాలని కనలేదుగా. దేవుడిచ్చాడు. పుచ్చుకున్నాను....." అంది సుబ్బలక్ష్మి.

"నీ తప్పు లేదు అమ్మ తప్పూ లేదు. తప్పంతా నాదే. ఇద్దరాడ పిల్లలు పుట్టాకైనా బుద్ధొచ్చి ఆపరేషన్ చేయించుకునుంటే సరిపోయేది. మగ పిల్లాడు పుడతాడని వాడెవడో తలమాసినోడు జ్యోతిష్యం చెబితే నమ్మేను. ఇప్పుడనుభవిస్తున్నాను...!"

"మరీ అంత ఇదైపోతారెందుకూ. నారు పోసిన వాడు నీరు పోయడా. ఏదో దారి దొరుకుతుంది..."

"ఇంకేం దారీ లేదు గోదారి తప్ప. ఇంకా మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చోవడం అనవసరం. పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకుందువు గాని. డాక్టరమ్మతో మాట్లాడతాను..."

సుబ్బలక్ష్మి మాట్లాడలేదు. ప్రక్కలోని బిడ్డవంక చూస్తూండిపోయింది.

ఇంతలో వారి మిగతా పిల్లల్ని తీసుకొచ్చింది సుబ్బలక్ష్మి తల్లి,

నాలుగేళ్ళ అనిత రెండేళ్ళ సరిత బుజ్జిపాపని చూసి మురిసిపోయారు. కేరింతలు కొట్టారు.

"బెంగ పెట్టుకుంటావెందుకయ్యా. ఆడపిల్ల ఆదిలక్ష్మి అన్నారు. చూస్తూండు. నీ కూతుళ్ళు కొడుకుల కన్నా ఎక్కువగా మిమ్మల్ని చూస్తారు. అయినా మేమంతా లేమూ!"

అత్తగారి ఆఖరి మాటలకు ప్రాణం లేచొచ్చింది సుబ్బారావుకి. వాళ్ళ పరిస్థితి బాగానే వుంది. ఓ చేయి అందిస్తే చాలు ఇట్టే ఒడ్డున పడిపోవచ్చు.

"నేనూ అదే అంటున్నానత్తయ్యా. మీరున్నారు. మావయ్య గారున్నారు. బావమరిది వున్నాడు. వదినగారున్నారు. మన పిల్లలకే లోటూ రానివ్వరని చెవునిల్లు కట్టుకుని పోరుతున్నాను. సుబ్బలక్ష్మి వినటం లేదు. మీరైనా ధైర్యం చెప్పండి అత్తయ్యా...!"

భర్త మాటలకి విస్తుబోతూ చూసింది సుబ్బలక్ష్మి. కళ్ళతో ఏవో సైగలు చేశాడు గాని ఆమెకేమీ అర్థం కాలేదు.

"నువ్వేం బెంగపెట్టుకోకమ్మాయ్. ఒకళ్ళని అన్నయ్య కొడుక్కి చేసుకుంటాం. నాదీ హామీ. సరేనా?"

తల్లి మాటలకి పొంగిపోయింది సుబ్బలక్ష్మి. పొత్తిళ్ళలోని బిడ్డని మురిపెంగా ముద్దు పెట్టుకుంది.

తప్పట్లు కొట్టారు అనితా సరితా.

* * *

మూడో బిడ్డకి హరిత అని పేరు పెట్టారు.

బారసాల, ఊయలలో వేయటం, నామకరణం వగైరా వేడుకులేం చెయ్యలేదు.

ఒకరోజున సుబ్బారావూ సుబ్బలక్ష్మీ బిడ్డని గుడికి తీసుకెళ్ళి 'హరితా' అని పిలిచారంతే.

హరితకి మూడో నెల వచ్చింది.

సుబ్బలక్ష్మి ఆరోగ్యం కుదుట పడింది. పురుట్లోనే ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకోవాలనుకుంది. కాని టైఫాయిడ్ ఫీవర్ రావటం వల్ల వాయిదా వేసుకున్నారు.

"డాక్టరమ్మతో మాట్లాడాను. రేపు పదింటికి అడ్మిట్ చెయ్యమన్నారు'' అన్నాడు సుబ్బారావు.

"పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకున్న వాళ్ళకి సర్కారోడు డబ్బూ చీర ఇంకేవేవో ఇస్తున్నాట్ట. అవన్నీ ముందే కనుక్కోరా అబ్బాయ్. నువ్వు వెర్రి బాగులవాడిలా కన్పిస్తే అవన్నీ డాక్టర్లే మింగేస్తారు!" అందతడి తల్లి శేషమ్మ.

"అన్నీ కనుక్కున్నాన్లే గాని మా అత్తగార్ని రమ్మని కబురంపనా?"

"ఇంతోటి దానికి మళ్ళీ ఆవిడెందుకూ! అయిన దానికీ కాని దానికీ గొప్పలకి పోకు. అదనపు ఖర్చు నెత్తికెత్తుకోకు. నీ గుండెల మీద మూడు కుంపట్లున్నాయి ఏవిటనుకున్నావో...!"

ఆ తర్వాత తన మీద వడగళ్ళ వాన కురిపిస్తుందని భయపడిపోయింది సుబ్బలక్ష్మి, పిల్లకి పాలిచ్చే నెపం మీద లోపలి కెళ్ళిపోయి నిట్టూర్చింది.

సుబ్బలక్ష్మి అక్క సీతా, బావ మురళీ వచ్చారు. వాళ్ళు రాజమండ్రిలో వుంటున్నారు. అతడేదో బ్యాంకులో పనిచేస్తున్నాడు.

హరిత పుట్టేక ఇదే రావటం.

“భోజనం వేళకొచ్చారు చూడు!” ముఖం ముడిచింది శేషమ్మ.

ఆవిడ మాటలు విన్పించినా విన్పించనట్టే నవ్వుతూ “మీ ఆరోగ్యం బాగుందా అత్తయ్యగారూ” అని పలకరించింది సీత.

“నాకేం రోగం గుండ్రాయిలా వున్నాను. నీ చెల్లెలూ నిక్షేపంలా వుంది. మధ్యలో నా బిడ్డ కొచ్చిపడింది మనేద!”

“ఇందులో మనోవ్యథ పడాల్సిన పనేముంది అత్తయ్య గారూ. ఆడపిల్లలు బుద్ధిగా వుంటున్నారు. చక్కగా చదువుతున్నారు. మగాళ్ళతో పోటీపడి ఉద్యోగాలు చేస్తున్నారు...”

“ఆడంగుల్తో ఉజ్జోగాలు చేయించడం మా ఇంటా వంటా లేదు లేమ్మా!” చేతులు తిప్పింది.

వెర్రిగా నవ్వి ఆవిడ్ని తప్పించుకుని లోపలి కెళ్ళింది సీత.

“ఎంత సేపయ్యిందక్కా వచ్చీ”

“ఇదే రావటం గాని మీ అత్తగారు గడ్డు మనిషే బాబూ ఎలా వేగుతున్నావో ఏమో!”

“మాట పెళుసు గాని మనస్సు మెత్తనే. కొడుకు మీద మాత్రం ఈగని కూడా వాలనివ్వదనుకో. ఇప్పటికీ కొడుకుకి పెట్టేకే తను తింటుంది”

“తల కొరివి పెడతాడు కదా!”

చివ్వున తలెత్తి చూసింది సుబ్బలక్ష్మి. ఆమె చూపులు పట్టించుకోకుండా “బుజ్జి ఏం చేస్తోందీ” అంటూ హరితని ఎత్తుకుంది.

స్పర్శలోని మార్పుకి గుక్క పెట్టింది బిడ్డ.

“పెద్దమ్మనే.. ఏడవకు ఏడవకు.... వూరుకో నా బుజ్జి తల్లీ.....”

అయినా వూరుకోలేదు. తిరిగి తీసేసుకుంది సుబ్బలక్ష్మి.

చెంగుతో పాప ముఖాన్ని కప్పి పాలు ఇస్తూ అంది “కబుర్లేంటక్కా..”

సీత మనస్సు చివుక్కుమంది. తన దృష్టి పడకుండా పవిట కప్పి పాలు ఇస్తున్నట్టు భావించింది.

‘తనకు పిల్లలు లేనందునే కదా’ అనుకుని ఉక్రోషపడింది. కంటిలో కదిలిన కన్నీటి పొర కన్పించకుండా మొఖం తిప్పుకుని తుడిచేసుకుంది.

“మాట్లాడవేంటక్కా..”

“ఏముంటాయ్...” పొడిగా నవ్వింది.

“రేపు ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకుంటున్నాను...”

"నిజమా? బ్రతికించావు. ఇవాళ రావటం మంచిదైందయితే"

"ఇప్పుడే వయ్యిందక్కా"

"మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలనొచ్చాం నేనూ మీ బావగారూ"

"దేని గురించీ..."

"మీరు మాకో బిడ్డని కనివ్వాలి...!"

"అక్కా!"

తలొంచుకుంది సీత "ఇద్దరమూ చాలామంది డాక్టర్లకు చూపించుకున్నాం. చాలా మందులు వాడాం. మాకింక పిల్లలు పుట్టే ఛాన్స్ ఆల్మోస్ట్ లేదన్నారు....."

"వైద్యం ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో అది కష్టమనుకోను"

"మా దురదృష్టం. అంతే" చటుక్కున చెల్లెలి చేతులు పట్టుకునంది "మా కోసం ఒక్క బిడ్డని కనియ్యి.. ప్లీజ్..."

"ఇప్పటికే ముగ్గురు ఆడపిల్లల్తో.....!

"ఎవరైనా ఫర్లేదు. ఆడపిల్లా మగపిల్లాడా అన్నది చూడదల్చుకోలేదు. మా కోసం ఆపరేషన్ చేయించుకోవడం మానేసి ఒక్క నలుసుని.....!"

ఆమె కళ్ళు కన్నీళ్ళతో నిండి పోయాయి. చిన్నగా ఏడ్చింది.

"వూరుకో అక్కా. ఈ మాత్రానికింత ఇదవ్వాలా. ఆయనా అత్తయ్యా ఏవంటారో! పోనీ హరితని పెంచుకోకూడదూ!"

"వూహుఁ. మాకు మా బిడ్డ కావాలి. మా బిడ్డగా ఎదగాలి. కన్ను తెరవగానే మొదట నన్నే తల్లిగా చూడాలి. మేమే పేరు పెట్టాలి.....!'

"ఇప్పుడైతేనేం. మీ ఇష్టమొచ్చిన పేరు పెట్టుకోండి. తీసుకు పోయి పెంచుకోండి. ఇంకా పసి గుడ్డే కదా. నా ఆరోగ్యం బాగుండక గాని లేకపోతే ఈ పాటికి బొద్దుగా ముద్దుగా వుండేదే..."

"అతికష్టం మీద మీ బావగార్ని ఒప్పించాను. కాదనకు చెల్లీ. గర్భంలో పడింది మొదలు మా బిడ్డగానే పెరగాలి. మందులూ టానిక్కులూ పండ్లూ... అన్నీ సమకూరుస్తాం.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2161**

* * *

**Read other books of Mr. Simha Prasad @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Simha+Prasad&id=733**